ప్రజాశక్తి

బుధవారం 5 ఏప్రిల్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

నిధులు కటకట

- అభివృద్ధికి నోచని పంచాయతీలు
- పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి
- ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు
- ఏకగ్రీవ పంచాయతీలకు అందని నజరానా

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

పంచాయతీల పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించి రెండేళ్లయినా ఆయా గ్రామాలు చెప్పుకోదగ్గ అభివృద్ధికి నోచుకోలేదు. ఇందుకు అనేక అంశాలు కారణాలుగా ఉన్నాయి. వీటిలో పంచాయతీల ఖాతాల్లో ఉన్న 14, 15వ ఆర్థిక సంఘ నిధులు పాలకవర్గాల ఆమోదం లేకుండానే ప్రభుత్వం విద్యుత్ బకాయిలకు మళ్లించడం. అంతేగాక ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలు ఇంకా అందలేదు. ఈ పరిస్థితుల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా పంచాయతీల పాలకవర్గాలు గ్రామాల అభివృద్ధిలో తమ ముద్ర వేయలేని పరిస్థితి ఏర్పడింది. కృష్ణా జిల్లాలో 497 గ్రామ పంచాయతీలు ఉండగా, 479 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించిన అనంతరం 2021 ఏప్రిల్ మూడో తేదీన పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించాయి. విలీన ప్రతిపాదనలతో 18 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఎన్నికలు నిర్వహించిన పంచాయతీల్లో పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించినది మొదలు నిధుల సమస్య తలెత్తింది. పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులన్నీ విద్యుత్ బిల్లులకు ప్రభుత్వం మళ్లించింది. 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి మొత్తం 22 కోట్లా 76 లక్షల 58 వేల 329 రూపాయలు దారిమళ్లాయి. అలాగే 64 ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహంగా ప్రభుత్వం 3 కోట్లా 25 లక్షల రూపాయలు ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ నిధులేవీ ఇవ్వకపోవడంతో నిధులు లేక ఆర్థిక లోటుతో గ్రామ పంచాయతీలు ఇబ్బంది పడుతున్నాయి. పంచాయతీల్లో పారిశుధ్యం నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా తయారైంది. ఆర్థిక సమస్యలతోనే పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీల్లో పనిచేసే గ్రీన్ అంబాసిడర్లు, పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించడంలో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. ఆర్థిక సంఘం నిధులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, గ్రాంట్లు లేకపోవడంతో పలు పంచాయతీల్లో మౌలిక వసతులైన రోడ్లు, డ్రైన్లు వంటి కనీస సదుపాయాలను కూడా కల్పించలేని దుస్థితి ఏర్పడింది.

రెండు పంచాయతీల్లో రూ.1.63 కోట్ల అవినీతి

మరోవైపు ఈకాలంలోనే రెండు మేజర్ పంచాయతీల్లో భారీ ఆర్థిక అవకతవకలు వెలుగుచూశాయి. గన్నవరం, చల్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీల్లో భారీగా అవినీతి వెలుగు చూసింది. గన్నవరంలో రూ.1.42 కోట్లు, లక్ష్మీపురంలో రూ.21 లక్షలకుపైగా అవినీతి జరిగినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు.

త్రిశంకు స్వర్గంలో 18 పంచాయతీలు

మచిలీపట్నం నగరపాలక సంస్థలో తొమ్మిది, గుడివాడ మున్సిపాల్టీలో ఆరు, గుడ్లవల్లేరు మేజర్ పంచాయతీలో మరో మూడు గ్రామాలను విలీనం చేయాలనే పేరుతో జిల్లాలోని మొత్తం 18 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. అయితే వివిధ కారణాలతో విలీన ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. రెండేళ్లయినా ఈ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు ఈ పంచాయతీలకు నిలిచిపోయాయి. ప్రత్యేక అధికారుల పాలనలోనే ఇవి కొనసాగుతున్నాయి.

12 నుండి చంద్రబాబు పర్యటన

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 'ఇదేం ఖర్మ'
- సన్నాహాలు చేస్తున్న టిడిపి శ్రేణులు



ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి కృష్ణాజిల్లాలో పర్యటించేందుకు రంగం సిద్ధమైంది. చంద్రబాబు తనయుడు నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర ప్రస్తుతం రాయలసీమలో కొనసాగుతోంది. ఇదే సమయంలో ఎన్టీఆర్ పుట్టిన గడ్డయిన ఉమ్మడి కృష్ణాజిల్లాలో చంద్రబాబు పర్యటన ఖరారైంది. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈనెల 12న నూజివీడులో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఈనెల 13న హనుమాన్‌జంక్షన్లో బయలుదేరి సాయంత్రం 5 గంటలకు గుడివాడలో జరిగే రోడ్ షోలో చంద్రబాబు పాల్గొంటారు. అక్కడ జరిగే సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. ఆ తర్వాత పామర్రు బయలదేరి వెళతారు. 13వ తేదీ రాత్రి ఎన్టీఆర్ జన్మస్థలమైన పామర్రు మండలం నిమ్మకూరులో బస చేస్తారు. 14న మచిలీపట్నంలో జరిగే రోడ్డు షో, సభలకు హాజరవుతారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసేందుకు టిడిపి శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి. తమ బల ప్రదర్శనకు సిద్ధమవుతున్నాయి. రోడ్డు షోలు, సభలకు పెద్దఎత్తున ప్రజలను తరలించేందుకు ఆ పార్టీ కార్యకర్తలు, నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. మరోవైపు టిడిపి నేతల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆధిపత్య పోరు, గ్రూపు తగాదాలు పతాక స్థాయికి చేరుకోవడం చంద్రబాబును కలవరపాటుకు గురి చేస్తున్నాయి. ఆ పార్టీ నేతలు బాహాటంగానే ఒకరిపై మరొకరు విమర్శలు గుప్పించుకుని రచ్చకెక్కుతున్నారు. ఈ పంచాయితీలు చంద్రబాబు వద్దకు కూడా వెళ్లాయి. ఇరుగ్రూపులకు సర్దిచెప్పినా పూర్తి స్థాయిలో ఇంకా సద్దుమణగలేదు. ఈనేపథ్యంలో చంద్రబాబు ఉమ్మడి కృష్ణాజిల్లా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రూపు రాజకీయాలకు ఏవిధంగా పుల్‌స్టాప్ పెడతారోనని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. 2014 ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక స్థానాలు గెలుచుకున్న టిడిపి ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో చతికిలపడింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 16 అసెంబ్లీ స్థానాలకుగాను 10 స్థానాల్లో టిడిపి, మరో స్థానంలో ఆ పార్టీ

(మిగతా 6లో)

జాబ్ మేళాల ద్వారా యువతకు ఉపాధి

అధికారులకు కలెక్టర్ డిల్లీరావు ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జాబ్ మేళాల నిర్వహణ ద్వారా నిరుద్యోగులను గుర్తించి వారికి అవసరమైన వృత్తి నైపుణ్యంపై శిక్షణనిచ్చి మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ విడిది కార్యాలయ వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జిల్లా స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ప్రతి నెల జిల్లా, నియోజకవర్గ స్థాయిలో జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. వాలంటీర్ల ద్వారా కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించి నిరుద్యోగ యువతను గుర్తించి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జాబ్ మేళాల్లో పరిశ్రమల నిర్వాహకులను భాగస్వామ్యం చేసి ఎంపికైన అభ్యర్థులకు మెరుగైన జీతభత్యాలు లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా స్కిల్ కమిటీ సభ్యులు నియోజకవర్గంలోని స్కిల్ హబ్‌లను పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. స్కిల్ కమిటీ కన్వీనర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పి.వి.రమేష్‌కుమార్, కో కన్వీనర్ పి.నరేష్‌కుమార్ మాట్లాడుతూ విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో 30 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నిషియిన్ కోర్సుల్లో విద్యార్థులు శిక్షణ పొందుతున్నారన్నారు. జగ్గయ్యపేటలోని ఎస్‌జిఎస్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల, మైలవరంలోని డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, నందిగామలోని గవర్నమెంట్ పాలిటెక్నికల్ కళాశాల, తిరువూరులోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సివిఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల్లో నిరుద్యోగులకు శిక్షణ ప్రారంభించామన్నారు. ఈసమావేశంలో ఎల్‌డియం పి.కోటేశ్వరరావు, గ్రామ వార్డు సచివాలయ జిల్లా అధికారి కె.అనూరాధ, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షామ్ సున్నీసా బేగం, గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ యు.శ్రీనివాస్‌రావు, మెప్మా పీడీ ఎస్‌ఎన్ వైష్ణవి, మైలవరం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్లా రవి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ వీరశేఖర్, ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సివిఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, గవర్నమెంట్ ఐటిఐ ప్రిన్సిపాల్ ఎం.కనకారావు, గవర్నమెంట్ పాల్‌టెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో అధికారుల సహకారం మరువలేనిది

కలెక్టర్ ఎస్.డిల్లీరావు

వార్త 6లో

ముగ్గురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

పామర్రు మండలంలోని జమీగొల్వేపల్లి, ఘంటసాల మండలం శ్రీకాకుళం జిల్లా పరిషత్ పాఠశాలల్లోని ముగ్గురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆయా పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించిన సమయంలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ లోపాలను గుర్తించారు. అకడమిక్ లోపాలు, నాడు నేడు పనుల్లో జాప్యం కారణంగా జమీగొల్వేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణపై, విద్యార్థులతో వర్క్‌బుక్‌లు రాయించకపోవడం, వాటిని రోజువారీ కరెక్షన్ చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు ఆ పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయులు నరసమాంబపై సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే శ్రీకాకుళం జిల్లా పరిషత్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిపైనా ఇదే కారణంతోనే సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి తహెరాసుల్తానా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అవనిగడ్డ ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ప్రాంతీయ అధికారికి ప్రవీణ్‌ప్రకాష్ సూచించినట్లు తెలిసింది.

కృష్ణాజిల్లా పరిషత్ సిఇఒగా వి.జ్యోతిబసు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా వీర్ల జ్యోతిబసును నియమిస్తూ పంచాయతీ రాజ్, రూరల్ డవలప్‌మెంట్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జ్యోతిబసు ఎపిఐఐసి చీఫ్ జనరల్ మేనేజర్‌గా ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో సిఇఒగా విధులు నిర్వహించిన టి.సూర్యప్రకాశరావు రాష్ట్ర గవర్నర్ ప్రత్యేక కార్యదర్శిగా గతేడాది జూలై ఆరో తేదీన బదిలీ అయ్యారు. అప్పటి నుండి జి.శ్రీనివాసరావు ఇన్చార్జి సిఇఒగా వ్యవహరిస్తున్నారు.



అధిక దిగుబడినిచ్చే వంగడాలపై దృష్టి

కెవికెలో రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని గరికపాడులో ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న డా.కె.యల్.రావు కృషి విజ్ఞానకేంద్రం (కేవీకే) ను భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఆటారి) జోన్ 10 డైరెక్టర్ డా. షేక్ ఎన్ మీరా , ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డా.బి.విజయాభినందన, ఉప విస్తరణ సంచాలకులు డా.బి.ముకుందరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా నందిగామ మండలం పల్లగిరి గ్రామంలో ఉదయం మెగా పశువైద్య శిభిరం నిర్వహించారు. ఈ శిభిరంలో పశువులకు, మేకలు మరియు గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో వరి మరియు కంది విత్తనోత్పత్తి క్షేత్రాలను, వివిధ రకాలతో ప్రదర్శించిన వరి, అపరాలు, చిరుధాన్యాలు, కూరగాయ పంటలు, పశుగ్రాసాలను పరిశీలించారు. కృష్ణాజిల్లాకు వివిధ పంటలలో అనువైన అధిక దిగుబడులను ఇచ్చు వంగడాలను రైతులకు పరిచయం చేయాలని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను ఇచ్చే మార్గాలను సూచించాలని, వాటి పై రైతు పొలాల్లో ప్రదర్శనలు చేయాలని శాస్త్రవేత్తలకు సూచించారు. చిరుధాన్యాల పంటలను మరియు వాటి ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. మిర్చి, ప్రత్తి మరియు ఉద్యానవన పంటల సాగు విషయమై రైతులు మరియు శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమములో డా.ఐ. భాస్కర రావు, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధనా స్థానం, కేవీకే శాస్త్రవేత్తలు డా.పి.ఎన్.శివప్రసాద్, డా.ఇందూరి వెంకటరెడ్డి, డా.ఎన్. రాజశేఖర్, డా.కె.లక్ష్మికళ, డా.టి.జస్వంత్‌రెడ్డి, డా.ఆర్.ప్రభావతీ, శ్రీ ఎం.రాజనరసింహ మరియు ఇతర బోధనేతర సిబ్బంది ఎస్.విజయకుమారి,ఆదిమళ్ళ రాజకుమార్, గంట్ల మహేంధర్ రెడ్డి, డి.వైష్ణవి, మణికంఠ సురేశ్ బాబు, ఎ.అఖిల్ మరియు తక్కెళ్లపాడు, అనుమంచిపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

'పది'లో అక్రమాలు జరిగితే అధికారులదే బాధ్యత : దేవానందరెడ్డి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో ఎద్దైనా అక్రమాలు, అవకతవకలు జరిగితే చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, సి సెంటర్ కస్టోడియన్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాలన్నీ నో మొబైల్ జోన్‌లుగా ప్రకటించడం జరిగిందన్నారు. కావున పరీక్ష విధులలో పాల్గొనే సిబ్బంది అంతా తమ మొబైల్ ఫోన్ ఇంటిలోనే ఉంచి రావాలని లేదా సెంటర్‌లో పోలీస్ పికెటింగ్ వద్ద మొబైల్ అప్పగించాలన్నారు. ఒకసారి పరీక్ష కేంద్రంలోకి వచ్చిన సిబ్బంది, పరీక్ష ముగిసేవరకు ఎటువంటి పరిస్థితులలోనూ బయటకు రాకూడదన్నారు. అటెండర్లు , ఇతర సహాయకులు కూడా టీ, ఇతర శీతల పానీయాల వంటి అవసరాలకు కూడా పరీక్షా సమయంలో బయటకు రాకూడదని తెలిపారు. పరీక్ష విధులు లేని ఉపాధ్యాయులు పరీక్ష జరిగే సమయంలో పరీక్షాకేంద్రాల పరిసరాలలో ఉండకూడదన్నారు. పరీక్షా కేంద్రాలుగా ఉన్న కె.జి.బి.వి., రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన పరీక్ష విధులు లేని ఉపాధ్యాయులు పరీక్ష జరిగే సమయంలో పాఠశాలలో ఉండకూడదన్నారు. పరీక్షా కేంద్రంలో ప్రయివేట్ వ్యక్తులు ఎవరూ ఉండకూడదని తెలిపారు. పరీక్ష ప్రశ్నాపత్రాలు, వాటిపై వందంతులు వాట్సాప్ గ్రూపులలో కాని, సామాజిక మాద్యమాలలో కాని ప్రచారం చేయకూడదన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, పరీక్షకు హాజరుకాని అభ్యర్థుల ప్రశ్నాపత్రాలను, మిగిలిన ప్రశ్నాపత్రాలను ఉదయం 10 గంటలలోపల ప్రశ్నాపత్రాల అకౌంట్ రాసి జాగ్రత్తగా సీల్ చేసి ఉంచాలన్నారు. పై నిబంధనలు అతిక్రమించిన వారిపై పరీక్షల చట్టం 25-97 ప్రకారం ఏడు సంవత్సరాల వరకు జైలుశిక్ష , లక్ష రూపాయల జరిమానాకు శిక్షార్హులన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షునిగా ప్రతాప్

ప్రజాశక్తి-మైలవరం: మైలవరం నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడిగా బుర్రి ప్రతాప్ ఎన్నికైనట్లు మంగళవారం ఆయన ఒక

ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు బంజల దయానంద్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బుర్రి ప్రతాప్ మాట్లాడుతూ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని, క్రిస్టియన్ మైనార్టీ అభివృద్ధి కోసం కషి చేస్తానని అన్నారు.

సిఐ, కానిస్టేబుల్‌కు నాన్ బెయిలబుల్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని కోర్ట్ సీసీ నంబర్ 901/2017, నూకల ఆస్మా దాఖలు చేసిన ప్రైవేట్ కేసులో ప్రథమ ముద్దాయి అయిన అప్పటి జగ్గయ్యపేట సిఐ వై వి ఎల్ నాయుడు మరియు 4వ ముద్దాయి అయిన అప్పటి జగ్గయ్యపేట స్టేషన్ కానిస్టేబుల్ జి శివ నాగరాజు కోర్టు వాయిదాలకు రానందున, వారి ఇరువురుపై జగ్గయ్యపేట కోర్టు వారు ఏప్రిల్ 4న నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేస్తూ కేసును ఏప్రిల్ 17వ తేదీకి వాయిదా వేశారు.

మైలవరంలో ఎంఎల్‌ఎ పర్యటన

ప్రజాశక్తి-మైలవరం: మైలవరం సచివాలయం-4 పరిధిలో దేవుని చెరువు తారకరామా నగర్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. డ్రైనేజీలు లేవని, ఇంటి స్థలం రాలేదని, కొన్నిచోట్ల డ్రైనేజీల్లో పూడిక తీయాలంటే డబ్బులు అడుగుతున్నారని, చెత్త ట్రాక్టర్ పది రోజులకు కూడా రావడం లేదని, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు సమస్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మంజు భార్గవి, ఉపసర్పంచి సీతారామరెడ్డి, ఎంపీపీ ప్రసన్న రాణి, జడ్పిటిసి తిరుపతిరావు, ఎఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కంచి రామారావుకు పలువురి నివాళి

ప్రజాశక్తి-తిరువూరు: రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావు భౌతికకాయాన్ని మంగళవారం పలువురు సందర్శించి నివాళులర్పించారు. ఎపి కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, విజయవాడ పార్లమెంట్ ఇన్‌ఛార్జి నరహరశెట్టి నరసింహారావు, పిసిసి కార్యదర్శి మేడా సురేష్, రాజీవ్ రతన్, జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్, నాయకులు సుంకర పద్మశ్రీ, పల్లెపాటి శ్రీనివాసరావు, ఆంజనేయులు, జీవన్‌బాబు తదితరులు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పాటు ఆయనతో ఉన్న అనుబంధాన్ని రుద్రరాజు వివరించారు. సిపిఎం సీనియర్ నాయకులు సానికొ మ్ము నాగేశ్వరరెడ్డి, గుల్లపల్లి వెంకటరత్నం, నాయకులు మేకల నాగేంద్రప్రసాద్, ఎస్వీ.భద్రం, నూకల సత్యనారాయణ, ఎం.ప్రభాకరరావు, ఆకుల రవి, బి.వెంకటేశ్వరరావు, కె.వి.రత్నం, పతంగి శ్రీనివాసరావు, యండ్రాతి సత్యన్నారాయణ, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, మాజీ మంత్రులు మండలి బుద్ధప్రసాద్, దేవినేని ఉమామహేశ్వరరావు, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ లావు తాంతియాకుమారి, మాజీ ఎమ్మెల్యేలు నల్లగట్ల స్వామిదాస్, శ్రీరాం తాతయ్య, పద్మజ్యోతి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శావల దేవదత్తు, నాయకులు గద్దె వెంకటేశ్వరరావు, వెదురు వెంకటనర్సిరెడ్డి, సంకురాత్రి జనార్ధన్‌రావు, బొల్లినేని నాగు, బొమ్మసాని మహేష్, న్యాయవాది చింతల వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు కొత్తపల్లి సుందరరావు, జనసేన పార్టీ మచిలీపట్నం ఇంచార్జ్ బండి రామకృష్ణ, నంబూరి శ్రీనివాసరావు, వెంకటకృష్ణ, జయప్రకాష్, బత్తుల వెంకటేశ్వరరావు, పసుపులేటి రవీంద్ర, మనోజ్ సుధాకర్, పసుపులేటి పండు, రామిశెట్టి జగన్, పలువురు వ్యాపారులు కంచి రామారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

11న ఇఫ్తార్ విందును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నందిగామ: ఏప్రిల్ 11 మంగళగిరి సీకే కన్వెన్షన్ లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించే ఆత్మీయ ఇఫ్తార్ విందులో మాజీ శాసనమండలి చైర్మన్ అహ్మద్ షరీఫ్ , రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ముస్తక్ అహ్మద్ , అనుబంధ సంఘాల అధ్యక్షులు నజీర్ , రాష్ట్ర టిడిపి మైనార్టీ నాయకులందరూ పాల్గొంటారని కావున పార్లమెంట్ పరిధిలోని రాష్ట్ర కమిటీ, పార్లమెంట్ కమిటీ, నియోజకవర్గ, మండల, పట్టణ, డివిజన్ కమిటీలోని వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొనాలని విజయవాడ పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తెలిపారు.

గంటాలమ్మ ఆలయంలో విశేష అలంకరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని ధర్మవరప్పాడు తండా గ్రామంలోని వేంచేసియున్న శ్రీ ఘంటాలమ్మ అమ్మవారి ఆలయంలో రామ్ కో సిమెంట్ కర్మాగారం తమిళ కుటుంబ సభ్యులు ఫంగిణి ఉత్తరం పురస్కరించుకుని రాగి జావ, చక్రపొంగలి, అలసందలు, దద్దోజనం, పులిహోర పండ్లు, ఫలాలు అమ్మవారికి గాజులు అలంకరణతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం అర్చకులు శివశంకర్ ప్రసాద్ శర్మ అమ్మవారి విశేషాలంకరణ చేసి నైవేద్యాలు సమర్పించారు.

ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తంబరేణి గార్డెన్స్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలకు వైయస్సార్ ఆసరా చెక్కులను సామినేని విమలభానుతో కలిసి ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ ఆసరా పథకం మహిళల ఆర్థిక స్వాలంబనకు బాసటగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, జడ్పిటిసి వుట్ల నాగమణి, ఎంపీపీ మార్కపుడి గాంధీ, కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చెని కుమారి తదితరులు పాల్గొన్నారు. అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను సామినేని ఉదయభాను లబ్ధిదారులకు అందజేశారు.

రేపు కెబిఎన్‌లో అనుగ్రహ భాషణం

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ కన్యకాపరమేశ్వరి విస్సంశెట్టి వెంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల ఆరో తేదీన కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారి అనుగ్రహణ భాషణం ఉంటుందని ఆ కళాశాల అధ్యక్షులు తొమ్మండ్రు శేషయ్య చెప్పారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రాంగణంలో కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కంచి కామకోటి పీఠం పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు నగరంలో పర్యటించనున్నారని పేర్కొన్నారు. ఆ క్రమంలో ఈ నెల ఆరో తేదీ సాయంత్రం ఆరు గంటలకు కేబీఎన్ కళాశాల ప్రాంగణాన్ని సందర్శించి భక్తులకు అనుగ్రహ భాషణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులైనని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందూహైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, ఎం వెంకటేశ్వరరావు, అధ్యాపకులు కే రామకష్ణ, టీ భాగ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెబిఎన్ కళాశాల అధ్యక్షులు శేషయ్య

దాది వెంకయ్యకు నివాళి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట నియోజకవర్గం ముక్త్యాల గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ దాది వెంకయ్య సంవత్సరీకం కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన దాది వెంకయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాది వెంకయ్య చేసినటువంటి సేవలను కొనియాడారు.

మహిళల ఉన్నతికి సిఎం జగన్ కృషి : మంత్రి

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలోని మహిళల సంక్షేమానికి సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణశాఖామంత్రి జోగి రమేష్ అన్నారు. బంటుమిల్లి, పెడన మండలాల్లో మంగళవారం జరిగిన ఆసరా మూడోవిడత చెక్కులను ఆయన పంపిణీచేశారు. **పెడన :** పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెడన మండలం చెన్నూరు గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించి వైయస్సార్ ఆసరా పథకం మూడో విడత నమూనా చెక్కులు పంపిణీ జేశారు. చెన్నూరు, చేవంద్ర, ఉరివి, కమలాపురం, కొంగ చర్ల గురువిందగుంట, కొప్పల్లి, లంకల కలవగుంట గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించిన ఈ సమావేశంలో ఈ 8 గ్రామాలకు సంబంధించి 244 గ్రూపులకు చెందిన 2425 మంది సభ్యులకు రూ.2.43 కోట్లు, కాగా పెడన మండల పరిధిలో 790 గ్రూపులకు చెందిన 7,851 మంది సభ్యులకు రూ.6.78 కోట్ల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ దేశంలో ఎన్ని రాష్ట్రాలు ఉన్నా మహిళ స్వయం సహాయ సంఘాలకు రుణమాఫీ చేసి డబ్బులు వారి ఖాతాల్లో జమచేస్తున్న ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. యువ నాయకులు జోగి రాజీవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, ఎంపీపీ ప్రత్యేక ఆహ్వానితులు అచ్యుతరావు, సర్పంచుల సంఘం అధ్యక్షులు భైరవలింగం, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీడీవో డి సుబ్బారావు, వెలుగు సిబ్బంది, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు. **మోపిదేవి:** మోపిదేవి మండలంలో 706 పొదుపు సంఘాల్లోని మహిళలకు రూ.7.41 కోట్ల నిధులు వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద విడుదలయ్యాయని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. మొత్తం మూడు విడతల్లో ఒక్క మోపిదేవి మండలానికి రూ.22.22 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. వైఎస్సార్ ఆసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం మోపిదేవిలో నిర్వహించిన సభలో శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వీర వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** బంటుమిల్లి మండలం ఆర్తమూరు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వైయస్సార్ ఆసరా మూడో విడత వారోత్సవాల్లో భాగంగా మంత్రి జోగి రమేష్ మెగా చెక్కును మహిళలకు పంపిణీ చేశారు. బంటుమిల్లి మండలంలోని ఆర్తమూరు, మణిమేశ్వరం, ముంజులూరు, కంచడం, బర్రిపాడు, సాతులూరు, ఇంతేరు, చినపాండ్రెక గ్రామాల్లో 355 స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు రూ.3.38 కోట్లు, చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ,గత అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాల్లోని మహిళల పేరుతో ఉన్న బ్యాంకు అప్పును ప్రభుత్వమే భరిస్తూ, ఆ మొత్తాన్ని వైయస్ఆర్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న విషయం తెలిసిందేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి జెడ్పీటీసీ మలిశెట్టి వెంకటరమణ, ఎంపీపీలు వెలివెల చినబాబు, మండల ఉపాధ్యక్షులు ఒడిమి చిన్నారిబాబు, యువ నాయకుడు జోగి రాజీవ్, బంటుమిల్లి ఏఎంసి చైర్మన్ కొల్లాటి బాలగంగాధరరావు, వైస్ చైర్మన్ పాలడుగు బాబూరావు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, బంటుమిల్లి మండల పార్టీ కన్వీనర్ ఎం.రాజబాబు, మండల సచివాలయ కన్వీనర్ కొప్పర్తి సుబ్బారావు, బీసీ సెల్ మండల అధ్యక్షులు బొమ్మిడి నాగార్జున, ఏ పి ఎం శ్రీనివాసు, ఎంపీడీవోలు స్వర్ణ భారతి, తహశీల్దార్ సత్యనారాయణ, సర్పంచులు బొర్ర రమేష్, వైయస్సార్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లిలో


మోపిదేవిలో



పెడనలో

ఘనంగా టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ

మాజీ మంత్రి కీర్తిశేషులు మండలి వెంకటకృష్ణారావు సతీమణి కీర్తిశేషులు మండలి ప్రభావతి దేవి జ్ఞాపకార్థం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మంగళవారం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుండి 28 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి ప్రభావతి దేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా కమిటీ నేతలతో కలసి విజయలక్ష్మి ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడారు. 28 జట్లకు లీగ్ మ్యాచ్ నిర్వహించి అనంతరం బెస్ట్ ఆఫ్ త్రీ ద్వారా ప్రథమ, ద్వితీయ, తతీయ, నాలుగో స్థానాన్ని నిర్ణయిస్తామని పోటీల నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5000, ద్వితీయ బహుమతిగా రూ.4000, తృతీయ బహుమతిగా రూ.3000, నాల్గో బహుమతిగా రూ.2000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ స్వయంగా పర్యవేక్షించారు. దివిసీమ వ్యాయామ ఉపాధ్యాయులు టి.రత్నకుమారి, కె.పూర్ణచంద్రరావు, బి.వెంకటేశ్వరరావు, జిఎల్ ప్రసాద్, కె.పణీంధ్ర, డి.శేషగిరి, ఎ.రామారావు, బి.నాంచారయ్య, శ్రీకాంత్, మారుతి భాను ప్రకాష్, వీరబాబు, రవికుమార్, చలమేశ్వరరావు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తలసిల స్వర్ణలత, కొల్లూరు వెంకటేశ్వరరావు, బండే రాఘవ, పంద్రాజు లంకమ్మ ప్రసాద్, మత్తి శ్రీనివాసరావు, గరికపాటి హరి, బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, పైడిపాముల కృష్ణకుమారి, దివి యుగంధరి, విశ్వనాథపల్లి పాప, మండలి వాణి, కొనపరెడ్డి చంద్రశేఖర్, గుడివాక నరహరి, యలవర్తి చిన్న, బర్మా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రభావతిదేవి

ధాన్యం రైతులు అధైర్యపడొద్దు : తహశీల్దార్

ప్రజాశక్తి-పమిడిముక్కల

ధాన్యం రైతులు అధైర్యపడొద్దనీ, ఇంకా పెండింగ్‌లో ఉన్న ధాన్యం వివరాలు సేకరించి ప్రభుత్వం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటుందని పమిడిముక్కల తహశీల్దార్ రాజ్యలక్ష్మి హామీ ఇచ్చారు. పమిడిముక్కల మండలంలోని అమీనాపురం, తాడంకి, కపిలేశ్వరపురం గ్రామాలకు చెందిన రైతులు మంగళవారంనాడు రెవెన్యూ కార్యాలయానికి వచ్చి తహశీల్దార్‌తో మాట్లాడారు. ఇంకా కుప్పల నూర్పిళ్లు పూర్తికాలేదనీ, ఇళ్లల్లో మరికొంత ధాన్యం నిల్వలు ఉన్నాయని వాటిని కూడా ప్రభుత్వం కొనగోలు చేసేలా చూడాలని రైతులు కోరారు. దీనికి తహశీల్దార్ స్పందిస్తూ ఇంకా కుప్పల నూర్పిళ్లు ఏమేరకు జరగాల్సివుంది?, నూర్చిన ధాన్యం అమ్మడానికి ఎంత సిద్ధంగా ఉంది? తదితర విషయాలపై గ్రామ విఆర్వోలు సర్వే చేసి నివేదిక ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కపిలేశ్వరం గ్రామ సర్పంచ్, అమీనాపురం వైఎస్ఆర్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ పోరంకి వెంకట వరప్రసాద్, రాము, బ్యాలా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- పెదపారుపూడి

మండలంలోని వానపాముల గ్రామంలోని శ్రీ అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి శతజయంతి మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేద పండితులు శత కళాభిషేకం చేశారు. ఆలయ నిర్మించి 100 ఏళ్ళు పూర్తికావటంతో సమీప గ్రామాల ప్రజలు కుటుంబాలతో వచ్చి స్వామివారి బ్రహ్మోత్సవాలను తిలకించారు. వైసిపి నేత వీరపునేని శ్రీనివాస్ రామాంజలు(నాని), పిఎసిఎస్ అధ్యక్షుడు పల్ల అరవింద్, మాజీ సర్పంచ్ ఎల్ సి డేవిడ్ రాజు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం పెద్దఎత్తున అన్న సమారాధన జరిగింది.

ఉద్యోగులు విరాళాలివ్వొద్దు : రాబర్ట్‌క్లైవ్

ప్రజాశక్తి-గన్నవరం

ఎంఇఎఫ్ సంఘం గన్నవరం శాఖలో అధ్యక్ష కార్యదర్శులు పలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆ సంఘం మాజీ అధ్యక్షులు రాబర్ట్ క్లైవ్ ఆరోపించారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గన్నవరం ఎం ఇ ఎఫ్ సంఘం అధ్యక్షులుగా ఉన్న రాజేష్, కార్యదర్శి బి.కోటేశ్వరరావులు ఉద్యోగుల నుండి సభ్యత్వం పేరుతో రూ.200, ఫండ్ కింద వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు. తాను రూ.3000 ఇస్తే రూ.200 సభ్యత్వం కింద చూపించి, రూ.2800 ఫండ్‌గా పేర్కొన్నారని వివరించారు. ఈ విధంగా ఉద్యోగస్తుల నుండి వేలాది రూపాయలు వసూలు చేశారన్నారు. అయితే లెక్కల్లో డొనేషన్ కింద కట్టిన డబ్బులు చూపించకుండా స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం తెలిసి లెక్కలు అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని తెలిపారు. మాదిగ ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి తమ సొంత ఖర్చులకు వాటిని వినియోగించుకోవడం తప్పు అన్నారు. ఈ విషయాలను ఉద్యోగస్తులు గమనించి వారికి ఏ విధమైన డొనేషన్లు ఇవ్వవద్దని కోరారు. ఈ విషయమై విచారణ చేపట్టి నెగ్గు తేల్చాలని సంఘంలోని సభ్యులందరినీ కోరినట్లు తెలిపారు.

నివేశన స్థలాలకు పొజిషన్ చూపండి : జర్నలిస్టులు

కలెక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు 2019లో ఇచ్చిన నివేశన స్థలాలకు పొజిషన్ చూపాలని కోరుతూ పలువురు పాత్రికేయులు మంగళవారం ఆర్డీఓ ఐ.కిషోర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం నియోజకనర్గంలోని 45 మంది జర్నలిస్టులకు చిట్టిపాలెం రోడ్డులో రెండు సెంట్లు చొప్పున నివేశన స్థలాలు ఇచ్చారని తెలిపారు. అప్పటి నుండి నేటి వరకు అధికారులు పొజిషన్ చూపకపోవటంతో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రంజిత్ భాషను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్డీఓకు ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలో బాధిత జర్నలిస్టులంతా ఆర్డీఓని కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ పట్టాలు ఇచ్చిన స్థలాలకు పొజిషన్ ఇవ్వడానికి గల సాధ్యాసాధ్యాలను త్వరలోనే పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

జాతరకు పోలీసు బందోబస్తు : డిఎస్‌పి

అవనిగడ్డ : అవనిగడ్డలోని శ్రీలంకమ్మ అమ్మవారి వార్షిక జాతర బుధవారం జరగనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ పి జాషువా ఆదేశాల మేరకు జాతర లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 170 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మచిలీపట్నం డిఎస్పి మహబూబ్‌బాష తెలిపారు. మంగళవారం బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బందికి డిఎస్పి పలు సూచనలు చేశారు. సిబ్బంది, అధికారుల ఆదేశాలు, సూచనలను విధిగా పాటించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ఏరులై పారుతున్న మద్యం : బోడే

ప్రజాశక్తి-ఉయ్యూరు

రాష్ట్రంలో వైసిపి పాలనలో మద్యం ఏరులై పారుతోందని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోడె ప్రసాద్ ఆ రోపించారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరు మండలం గండిగుంట బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో మంగళవారం ఆయన పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బోడే ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99శాతం నెరవేర్చామని ప్రగల్భాలు పలుకుతున్న ముఖ్యమంత్రి అధి కారంలోకి వస్తే మద్య నిషేదం చేస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. మద్యం ధరలు విపరీతంగా పెంచి దోచుకుంటున్నారని, నవరత్నాల పేరుతో ఒక చేత్తో ఇస్తూ మరో చేత్తో రెండింతలు గుంజుకుంటున్నారని విమర్శించారు. పేదలకు ఇళ్ళు నిర్మించి ఇవ్వాలన్న మహోన్నత లక్ష్యంతో చంద్రబాబునాయుడు బహుళ అంతస్తులతో టిడ్కో ఇళ్లు నిర్మిస్తే వాటిని పూర్తిచేసి ఇవ్వకుండా పాడుపెట్టి దిష్టిబొమ్మల్లా ఉంచారని ఆందోళన వ్యక్తంచేశారు. టిడిపి నాయకులు నాదెళ్ల యుగంధర్ ప్రసాద్, కొండాప్రవీణ్, గుండే రాంబాబు, ఉయ్యూరు మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, కాకాని శ్రీనివాసరావు, నజీర్, భాస్కర్, తెలుగు యువత నాయకులు దండమూడి చౌదరి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలను సందర్శించిన డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-ఘంటసాల

మండల పరిధిలోని శ్రీకాకుళం, తెలుగురాపాలెం సచివాలయాలను మచిలీపట్నం డిఎల్ డి వో పద్మావతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పద్మావతి సచివాలయంలోని అధికారుల హాజరు, పనితీరు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలను చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్ల నిబద్ధతగా ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగురావుపాలెం గ్రామ సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు మండల ఈవో పి ఆర్ డి గుత్తికొండ కిషోర్, ఈవో గోల్కొండ శ్రీనివాసరావు, జేఏ సందీప్ రెడ్డి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రాచూరు ప్రసాద్ బాబు పద్మావతి ని దశ్శలవతో సత్కరించారు.

పద్మావతిని సత్కరిస్తున్న ఉద్యోగులు

రేపు ఎలక్ట్రోవిజన్-2023 పోటీలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: మొగల్‌రాజపురంలోని పి.బి.సిద్దార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన కళాశాల ఆడిటోరియంలో 'ఎలక్ట్రోవిజన్ - 2023' ని నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. కళాశాల కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎలక్ట్రోవిజన్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించంతో పాటు సబ్జెక్టులో వివిధ అంశాలలో ప్రయోగాలను ప్రోత్సహించే విధంగా ఎలక్ట్రోవిజన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో తమ కళాశాలతో పాటు ఇతర కళాశాల విద్యార్థులు కూడా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు ఉంటాయన్నారు. వాటిలో ప్రదానంగా పోస్టర్ ప్రజంటేషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్, ప్రాజెక్టు ఎగ్జిబిషన్, టెక్నికల్ క్విజ్, సర్క్యూట్ డిజైనింగ్, ఐసి ఐడెంటిఫికేషన్, స్పాట్ ఫోటోగ్రఫీ, నిది అన్వేషణ, ఫ్యాషన్ షో, కాయిన్ ఫొండింగ్

అంశాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాలడైరెక్టర్ వి.బాబూరావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కె.వి.యస్. సాంబశివరావు, డి.శ్రీనివాసరెడ్డి, జి.నాగశశాంకా, విద్యార్థులు పాల్గొన్నారు.

'అణగారిన వర్గాల ఆశాదీపం బాబుజగ్జీవన్‌రామ్'

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరగని కషిచేసిన సంఘసంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధులు, భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తాయని ఎనికేపాడు విజ్ఞాన విహార ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యా విషయాల సలహాదారు పిఎస్ఎన్ మూర్తి అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 115 వ జయంతిని పురస్కరించుకొని పదో తరగతి విద్యార్థులు రామవరప్పాడు రింగు రోడ్డు కూడలిలో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహం పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడంతో పాటు, విగ్రహానికి మరియు పూలమాలలు వేసి నమస్సుమాంజలి అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అఖండ భారతావనికి విప్లవాన్ని సాకారం చేసిన పాలనాదక్షకుడు, అణగారిన వర్గాల అభ్యుదయానికి కషిచేసిన భారతదేశ అమూల్య రత్నమని వారి సేవలు గూర్చి పెద్దలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి, ఉప ప్రధాన ఉపాధ్యాయురాలు జి. శైలజ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: వికలాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేలా సిఎం జగన్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఏపీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డివిజన్లలో పర్యటించిన ఎమ్మెల్యేని ఉపకరణాల కోసం పలువురు వికలాంగులు విన్నవించారు. దీనికి స్పందించిన ఆయన విభిన్న ప్రతిభావంతుల, టిజి మరియు వయో వద్ధుల సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ముగ్గురికి మూడు చక్రాల సైకిళ్లు, ఒక వీల్ చైర్, నలుగురికి వినికిడి యంత్రాలు మంజూరు చేయించారు. మంగళవారం ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనములో ఎమ్మెల్యే ఉపకరణాలను అందజేశారు.

64వ డివిజన్లో 'ఇదేమి ఖర్మ'

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: కండ్రిక కాలనీలో సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొండా ఉమా ఆదేశాల మేరకు 25వ రోజు ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యావసర

వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పన్నులు పెంచారని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ప్రభుత్వ పథకాలు సరిగా అందడం లేదని, దోమల సమస్య అధికంగా ఉండటం వల్ల విష జ్వరాలు వ్యాప్తి చెందినా పట్టించుకునే నాథుడు లేడని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్, జిల్లా టిడిపి ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి వింజమూరి సతీష్‌బాబు, ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ నాయకులు పలగాని రాజశేఖర్, డివిజన్ ఇంచార్జ్ పలగాని శివ, డివిజన్ ప్రధాన కార్యదర్శి మామిళ్ళ దిలీప్, డివిజన్ సీనియర్ నాయకులు కోరాడ రమణ, తమ్మవరపు శివమ్మ పాల్గొన్నారు.

9న నున్న చినకంచికి కంచి పీఠాధిపతి

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి ఈ నెల 9న విజయవాడ రూరల్ మండలం నున్నలో చిన కంచిగా ప్రసిద్ధి చెందిన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి ఆలయాన్ని సందర్శించనున్నారు. రెండు రోజుల పాటు ఆయన ఇక్కడే బస చేసి, ఆలయంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. దీనికి సంబంధించి మంగళవారం నున్న చిన కంచి ఆలయంలో ఆలయ ధర్మకర్త మొక్కపాటి శర్మ, విజయవాడ రూరల్ మండల మాజీ వైస్ ఎంపీపీ జీతం శ్రీనివాసరావు బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ధర్మకర్త మొక్కపాటి శర్మ మాట్లాడుతూ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి విజయయాత్రలో భాగంగా చిన కంచికి వస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 9న స్వామివారు ఆలయాన్ని సందర్శించి సందేశం ఇస్తారని తెలిపారు. అలాగే పదో తేదీన శ్రీ మహా త్రిపుర సుందరి సమేత చంద్ర మౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు భాస్కరశర్మ, ఉమా మహేశ్వరరావు, నున్న ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, వైసీపీ నాయకులు అంగజాల హనుమా, నారాయణరెడ్డి, నాగిరెడ్డి, ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి దగ్ధం

ప్రజాశక్తి-వత్సవాయి: కంభంపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఉయ్యూరు రామారావు కల్లాల్లో ఆరబోసి అమ్మకానికి సిద్ధంగా ఉన్న 50 క్వింటాళ్ల మిర్చిని గుర్తుతెలియని దుండగులు తగలబెట్టారు. విషయం తెలుసుకున్న టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ ఘటనా స్థలానికి వెళ్లి రైతు రామారావును పరామర్శించి అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి రాంబాబు, ఉయ్యూరి అప్పారావు, చావా శాంతిబాబు, చిట్టూరి రమేష్ నెల్లూరి శ్రీనివాసరావు, బొల్ల వెంకటేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు

పాఠశాలకు గ్లాసుల వితరణ

ప్రజాశక్తి-తిరువూరు: మండలంలోని గానుగపాడు జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టీల్ గ్లాసులు వితరణగా మంగళవారం అందజేశారు.మధ్యాహ్న భోజన పథ కంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పంపి ణీ చేస్తున్న రాగి జావను విద్యార్థులు తాగేందుకు వీలుగా గ్లాసులను గ్రామానికి చెందిన కనకమేడల భారతి తన భర్త జయప్రకాష్ జ్ఞాపకార్థంగా వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయు రాలు జి.ఆదిలక్ష్మి తెలిపారు. ఈకార్య క్రమంలో ఉపాధ్యాయులు రాంప్రదీప్, సుదర్శన్, సాంబశివరావు, రాము, వెంకటేశ్వర్లు, శోభ, రామాచారి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్: చైత్ర మాస బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడోరోజు మంగళవారం ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దివ్య కళ్యాణ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. మంగళవారం మహా మండపం ఏడో అంతస్తు ధర్మపథము కళావేదిక వద్ద ప్రముఖ కవి పండితులచే శ్రీ స్వామి వారి, అమ్మవార్ల విశిష్టతను తెలియజేస్తూ వైభవంగా "రాయభారం" (ఎదుర్కోలు ఉత్సవం) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎదుర్కోలు కార్యక్రమం నందు పాల్గొన్న కవి పండితులను ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ళ భ్రమరాంబ సత్కరించడం జరిగింది. అనంతరం ధర్మపథం వేదిక నందు మంగళవాయిద్యములు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అత్యంత వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం మంగళ వాయిద్యములు, కోలాటలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సింహ వాహనంపై ఆదిదంపతుల ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. అలంకరించిన సింహ వాహనం పై శ్రీ గంగా దుర్గామల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు పూజలు చేశారు. ఆలయంలోని మల్లిఖార్జున మహామండపం నుండి బయలుదేరి కనకదుర్గా నగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, శ్రీనివాస మహల్, కోమల విలాస్ సెంటర్, సామరంగ చౌక్, మెయిన్ రోడ్, రథం సెంటర్ మీదుగా తిరిగి మహామండపానికి సింహ వాహన ఊరేగింపు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డ్ సభ్యులు బచ్చు మాధవీ కష్ణ, బుద్దా రాంబాబు, చింతా సింహాచలం, దేవాదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప పాల్గొన్నారు. దుర్గమ్మను మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగారావు దంపతులు దర్శించుకున్నారు. చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 7వ తేదీ శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల కృష్ణవేణి నదీ విహారము నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తికి ప్రసాదం అందజేస్తున్న ఇఒ

పరిటాలలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-కంచికచర్ల: పరిటాల గ్రామంలో మంగళవారం నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఇంటింటికి ఆయన వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యద్దనపూడి ఆనంద జోష్ణ, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మార్త రజిని శ్రీనివాస్, నాయకులు చింతా రవీంద్ర, విజయరావు, రామకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-గంపలగూడెం: నాడు నేడు రెండవ దశ పనులను గంపలగూడెం మండల పరిషత్ అభివద్ధి అధికారి మంగళవారం నాడు పరిశీలించారు. మండలంలోని పెద్ద కొమెర కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం నందు జరుగుతున్న నాడు నేడు పళ్ళను పరిశీలించారు. అదేవిధంగా కనుమూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాడు నేడు పనులను పరిశీలించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి-వత్సవాయి: గృహ నిర్మాణ లబ్ధిదారులు వీలైనంత త్వరగా గృహాలను పూర్తి చేయాలని హౌసింగ్ డిఈ ఖాదరవల్లి అన్నారు. వత్సవాయి మండలంలో సామినేని ఉదయభాను ఆదేశాలతో వత్సవాయి గ్రామము, కన్ని వీడు, ఇందుగుపల్లి, రామచంద్రపురం , వత్సవాయి జడ్పిటిసి యేశపోగు దేవమణి శ్రీనివాస్, రామచంద్రపురం సర్పంచ్ రాంబాబు, ఇందుకుపల్లి నాయకులు నాగేశ్వరరావు, అమరయ, కన్నివీడు నాయకులు శ్రీధర్‌ఆయా గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తో కలసి నిర్మాణంలో ఉన్న హౌసింగ్ కాలనీ పరిశీలించారు.

20లోగా భూముల్లో సర్వేరాళ్లు పాతాలి : కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో రీ సర్వే పూర్తయిన 102 గ్రామాల్లో ఈనెల 20వ తేదీలోగా సర్వే రాళ్లను పాతాలనీ, వెబ్ ల్యాండ్ డేటా వివరాలను ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి రీ సర్వే, భూ హక్కు పత్రాలు, స్పందన అర్జీల పరిష్కారం తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌భాష

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే పూర్తయిన 102 గ్రామాల్లో ఇప్పటివరకు 38,373 సర్వే రాళ్లను పాతారన్నారు. ఇంకా 36,074 సర్వే రాళ్ళను పాతించాల్సివుందన్నారు. వెబ్ ల్యాండ్ 2.0 డేటా వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త పద్ధతిలో రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలన్నారు. భూహక్కు పత్రాలకు సంబంధించి 29వేలకు గాను ఇంకా పెండింగ్ లో ఉన్న 8వేల రికార్డులు త్వరగా పూర్తిచేసి భూ హక్కు పత్రాలు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో గ్రామాల వారీగా లంకల భూముల పంపిణీకి కూడా త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ అసైన్మెంట్ భూముల వివరాలను సిద్ధం చేయాలన్నారు. అనాధీన భూములను ఒకసారి పరిశీలించాలన్నారు. స్పందన అర్జీలు మళ్లీ రాకుండా సరైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చొరవతో 18,235 ఎకరాలను 22-ఏ-1-ఈ పరిధి నుంచి తప్పించి కొత్తగా రిజిస్ట్రేషన్ చేసి ఆయా కుటుంబాలను ఆదుకున్నందుకు రిజిస్ట్రేషన్ శాఖకు ఇటీవల రూ.5 కోట్ల ఆదాయం లభించిందన్నారు. జిల్లా కలెక్టర్‌ను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.జిల్లా విభజన తర్వాత ఏడాది విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రశంసిస్తూ రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్ ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సర్వే భూ రికార్డుల ఏడి గోపాలరాజా, ఉయ్యూరు, గుడివాడ ఆర్డీవోలు విజయకుమార్, పద్మావతి, పలువురు తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు

ఆదర్శప్రాయుడు మోహనరావు

ప్రజాశక్తి-ఉయ్యూరు

సోషలిజం ద్వారా సమసమాజం ఏర్పడుతుందని తను నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస విడిచే వరకూ పోరాడిన కాటూరు మోహనరావు ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు అని సిపిఎం

మాట్లాడుతున్న వి.జ్యోతి

కృష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వీరమాచినేని జ్యోతి అన్నారు. ఉయ్యూరులోని సిపిఎం కార్యాలయంలో కీర్తిశేషులు కాటూరు మోహనరావు వర్థంతి సభ మంగళవారం జరిగింది. ఆయన చిత్రపటానికి జ్యోతి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మోహనరావు పేదలు, ఉపాధి కూలీలు, రైతులు, కౌలు రైతులు తదితరుల సమస్యలపై జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. సభకు కొడాలి ఏసు పాదం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పవన్ కుమార్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కె.కొండలబాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తెల్లాకుల బాజీ బాబు, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పడాల లక్ష్మణరావు, బి.కీర్తి, కలపాల రవి, మోహన్ రావు పెద్ద కుమారుడు, జాన్ వెస్లీ మనవడు సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు రోడ్‌షోను విజయవంతం చేయండి : రావి

గుడివాడ : ఈ నెల 13న టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గుడివాడలో రోడ్డు షోలో పాల్గొటారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న రావి

గుడివాడలో 13న హనుమాన్ జంక్షన్ నుంచి బయలుదేరి సాయంత్రం 5 గంటలకు చంద్రబాబు నాయుడు 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా పాల్గొనటానికి వస్తున్నారన్నారు. అనతరం జరిగే సభలో ఆయన మాట్లాడతారన్నారు. నందివాడ, గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్, పామర్రు మండలంలో పర్యటిస్తారన్నారు. టిడిపి వాణిజ్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకవరపు సునీల్, పట్టణ కార్యదర్శి పోలాసి ఉమా, నాయకులు కంచర్ల సుధాకార్, అకునూరు కనకబరం, అర్నేపల్లి పాండు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత : ఎంఎల్‌ఏ కైలే

పమిడిముక్కల : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అన్ని తరగతుల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలంలోని వీరంకిలాకులోని కళ్యాణ మండపంలో ఆసరా పథకంలో మూడో విడతలో భాగంగా రూ.10.71 కోట్ల చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి సిఎం జగన్ నిరంతరం

మాట్లాడుతున్న కైలే అనిల్‌కుమార్

కృషిచేస్తున్నారన్నారు. పేద విద్యార్థులు చదువుకోవడానికి కుటుంబం విద్యావంతులైతే సమాజం బాగుంటుందన్న ఆలోచనతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. పమిడిముక్కల ఎంపిపి కాసాని వేద సుప్రజ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, వైసిపి మండల అధ్యక్షులు యలమంచిలి గణేష్, శొంఠి వెంకటేశ్వరావు, పాతూరు చంద్రపాల్, యేనుగ మస్తానరావు, కొడాలి రాంబాబు, యేనుగ వెంకటేశ్వరరావు, కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు అక్కినేని సతీష్, కంబపు రాంబాబు, ఎంపిడిఒ సుధా ప్రవీణ్, తహశీల్దార్ రాజ్యలక్ష్మి, డిపిఎం త్రిపుర సుందరరావు, రాంబాబు, గుర్విందపల్లి వంశీ, మారపాక మహేశ్వరరావు, తాడంకి, లంకపల్లి కార్యదర్శులు సునీత, లంకపల్లి కార్యదర్శి విజయ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరప్రసాద్

ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా ఉండాలి

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎం.వెంకటేశ్వర ప్రసాద్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయటంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కీలక భూమిక పోషిస్తోందని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎం. వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వారి కార్యాలయంలో మచిలీపట్టణానికి చెందిన చెందిన పలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో డిఐపిఆర్ఒ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత ఆయన పేరు పేరున పాత్రికేయులందరిని పరిచయం చేసుకొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ స్నేహపూరిత వాతావరణంలో నిత్యం సమాచార శాఖ అధికారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కలిసిమెలిసి సోదరులు మాదిరిగా సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. పాత్రికేయులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలాగా పనిచేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి, నాడు-నేడు, రైతు భరోసా, వైఎఎస్సార్ ఆసరా, వసతి దీవెన, విద్యా దీవెన తదితర రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి ,సంక్షేమ పథకాల సమాచారాన్ని వార్తలను, విజయ గాథలను ప్రజలకు చేరవేయాలన్నారు. సమాచార శాఖ పీఆర్వోలు, పాత్రికేయులు సమన్వయంతో పనిచేసి కృష్ణాజిల్లాకు మంచిపేరును తీసుకు రావాలని కోరారు. మీడియా పరంగా ఏదైనా సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని ఆయన పాత్రికేయులకు సూచించారు. ఈ సమావేశంలో డివిజనల్ పి ఆర్ ఓ ఎస్. శ్రీనివాసరావు, ఏఈఐఈ, జె.శ్రీనివాసరావు, పిఆర్ ఓ ఎన్.జాన్సన్ జాకబ్, పలువురు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల కోసం 'మిషన్ వాత్సల్య'

గన్నవరం ఐసిడిఎస్ సిడిపిఒ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి-గన్నవరం

మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా స్పాన్సర్ షిప్ పోగ్రాంకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గన్నవరం సిడిపిఒ వెంకట లక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. భారత ప్రభుత్వం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న 'మిషన్ వాత్సల్య' పథకంలో భాగంగా నిరాధరణకు గురైన బాలలు, వారి విద్య, ఆరోగ్యం, అభివృద్ధి అవసరాలకు ఉపయోగపడే విధంగా ఆర్థికంగా ఆదుకుంటున్నామన్నారు. అనాథల కుటుంబపు ఆర్థిక పరిస్థితికి అనుబంధంగా షరతులతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లోని అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లి దండ్రులు దూరమైన వారు, పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు) విడాకులు పొందిన తల్లిదండ్రులు వున్నవారు,కుటుంబం వదిలివేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి భారిన పడినా, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం- 2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలలు, బాల కార్మికులు, అక్రమ రవాణాకు, దాడులకు గురైన బాలలు, బాల్య వివాహ బాధితులు, హెచ్.ఐ.వి. బాధిత, పీడిత బాలలు, వికలాంగులు, ఇతరులకు స్పాన్సర్షిప్ పథకం ద్వారా వారి అభివృద్ధికి ఉపయోగపడే విధంగా కుటుంబ వాతావరణంలో పెరగటానికి నిర్దిష్ట పరిధిలో ఒక్కొక్కరికి నెలకు రూ.4000 చొప్పున మిషన్ వాత్సల్య పథకం ద్వారా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ భారత ప్రభుత్వం నుండి నిధులు విడుదల చేయబడతాయన్నారు.

వైసిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగం నూతన కమిటీ ఎన్నిక

గుడివాడ : స్థానిక వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు పోలిమెట్ల జయరాజు అధ్యక్షతన మంగళవారం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుడివాడ

నూతన కమిటీ ప్రతినిధులు వీరే...

నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి వెంపటి సైమన్ మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఏర్పాటు ఆవశ్యకతను తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షునిగా జి.శ్యాంబాబు, గుడివాడ టౌన్ అధ్యక్షులుగా ఏలేటి జోషి, గుడివాడ రూరల్ అధ్యక్షులుగా నేతల సుబ్బారావు, నందివాడ మండల అధ్యక్షులుగా మేడేపల్లి ఇమ్మానియేల్, గుడ్లవల్లేరు మండల అధ్యక్షులుగా మేడూరి ఎలిషా ఎన్నికయ్యారు. జిల్లా క్రిస్టియన్ సెల్ జనరల్ సెక్రటరీ కె.జె. విక్టర్ పాల్, జిల్లా కార్యదర్శిగా మందా సువర్ణబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా జాలాది పండు, లంకపల్లి ప్రియనాధుడును ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వైసీపి క్రైస్తవ విభాగం నాయకులు పి.ఆర్ దీక్షితులు, డాక్టర్ యదిద్యా, మద్దా విజయరావు, తోట రాజేష్, కోలా ఎలీషా, చోరగుడి ఇశ్రాయేలు, జోనపూడి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏసుబాబుకు ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పి.ఏసుబాబుకు ఉద్యోగోన్నతి లభించింది. వీరులపాడు ఇఒపిఆర్‌డిగా ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాలుర ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు ఆయనకు మంగళవారం వీడ్కోలు పలికారు.

'మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్' దరఖాస్తు గడువు పొడిగించాలి

సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి

ప్రజాశక్తి - విజయవాడ

మిషన్ వాత్సల్య స్పాన్సర్షిప్ పథకానికి దరఖాస్తు చేసుకొనేందుకు ఏప్రిల్ 30వ తేదీ వరకు గడువు పొడిగించాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి చేశారు. భారత ప్రభుత్వం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న "మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్" పథకం ద్వారా తల్లి తండ్రి లేని అనాథ పిల్లలకు, అలాగే తండ్రి ఎడబాటుకు గురైన ఒంటరి మహిళ పోషణలో ఉన్న 6 నుండి 18 సంవత్సరాల వయసు కలిగిన పిల్లల విద్య కొనసాగింపునకుగాను ఆర్థికంగా ఆదుకునేందుకు ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా సమీపంలోని అంగన్వాడీ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కేంద్రం ప్రకటించిందని తెలిపారు. అయితే ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 10వ తేదీ గడువుగా నిర్ణయించారని, గడువు తక్కువగా ఉన్నందున అర్హులు దీనిని వినియోగించుకోవడంలో విఫలమవుతారని పేర్కొన్నారు. ఈనెల 5న జగ్జీవన్ రావ్ జయంతి, 7న గుడ్ ఫ్రైడే, 8న రెండో శనివారం, 9న ఆదివారం సెలవు దినాలు వచ్చాయని పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు పాటు జనన, విద్యార్హత, కుటుంబ ఆదాయం తదితర సర్టిఫికెట్లను జత చేయాల్సి ఉన్నందున దరఖాస్తు గడువును ఈనెల 30వ తేదీ వరకూ పొడిగించాలని సత్యబాబు విజ్ఞప్తి చేశారు.

అంబేద్కర్ స్మృతివనం పనులను పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి దినకర్, అదితిసింగ్

అంబేద్కర్ స్మృతివనం పనుల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ

స్వరాజ్య మైదానంలో జరుగుతున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను ఏపీ మున్సిపల్ శాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీ లక్ష్మీ, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్ మంగళవారం పరిశీలించారు. సిఆర్‌డిఎ, మున్సిపల్, ఎపిఐఐసి అధికారులు దీని నిర్మాణ పనులపై జరిగిన సమీక్షలో పాల్గొన్నారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణ పనులు పురోగతిని స్పెషల్ సీఎస్ శ్రీలక్ష్మికి విగ్రహ శిల్పి నరేష్ వివరించారు.

నేరాల నివారణపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ

కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీశారదా విద్యానికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు మానవ అక్రమ రవాణా, సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయో అవగాహన కల్పించారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పోక్సో చట్టం, డయల్ 100, 112, దిశ యాప్ వల్ల కలిగే ఉపయోగాలు, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, ఎల్‌హెచ్‌ఎంఎస్, మాదక ద్రవ్యాలు, మహిళా సంబంధిత నేరాలు తదితరాల గురించి అవగాహన కల్పించారు. గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలోని గుణదల గాంధీజీ కాలనీ, బిఆర్‌టిఎస్ రోడ్ ప్రాంతాల్లో ప్రజలకు చేరువ వాహనం ద్వారా ఈ అంశాలను వివరించారు. పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు అభినందనలు తెలుపుతున్న జెసి నుపూర్ అజయ్, డిఆర్‌ఒ కె.మోహన్‌కుమార్, కార్యాలయ అధికారులు, సిబ్బంది

జిల్లా అభివృద్ధిలో అధికారుల సహకారం మరువలేనిది

కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుకు జిల్లా అభివృద్ధిలో అధికారులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి మంగళవారం నాటికి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు విజయవాడ కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఒ, పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తిస్తూ లక్ష్య సాధనలో పోటీ తత్వాన్ని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఉపాధి హామీ, నాడు-నేడు, ఫ్యామిలీ ఫిజిషియన్, పోషణ్ అభియాన్ వంటి వినూత్న పథకాలను, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో అధికారులు ఎంతో కీలకంగా వ్యవహరించారని కొనియారు. అనేక ముఖ్య కార్యక్రమాలను సమిష్టి కృషితో విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్, డిఐపిఆర్‌వో యు.సురేంద్రనాథ్, డిపిఆర్‌వో ఎస్ వి.మోహన్‌రావు, డ్వామా, ఐసిడిఎస్, హౌసింగ్, డ్వో పీడీలు జె.సునీత, జి.ఉమాదేవి, రజనీ కుమార్, చిన్నోడు, ఎల్‌డియం పి.కోటేశ్వరరావు, డిఇవో సివి రేణుక, డియంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, టిబి కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ జె.సుమన్ పాల్గొని కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

కేక్ కట్‌చేస్తున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు, చిత్రంలో జెసి నుపూర్ అజయ్, డిఆర్‌ఒ కె.మోహన్‌కుమార్

రాజీవ్‌గాంధీ పార్కును పరిశీలించిన మేయర్

ప్రజాశక్తి - విజయవాడ : నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మంగళవారం రాజీవ్ గాంధీ పార్కు, అంబేద్కర్ పార్కులను పరిశీలించారు. రాజీవ్ గాంధీ పార్కులో మిగిలి ఉన్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈపర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) కె.వి.సత్యవతి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) శకుంతల, ఏడిహెచ్ శ్రీనివాసు, ఎస్టేట్ ఆఫీసర్ కె. అంబేద్కర్ పాల్గొన్నారు.

'మా నమ్మకం జగనన్న' సన్నాహక సమావేశం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్: విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలో 15 డివిజన్ రామలింగేశ్వర నగర్‌లోని వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్ ఆదేశాల మేరకు పెద్దలు, మాజీ డిప్యూటీ మేయర్, సీనియర్ నాయకులు ఆళ్ల చెల్లారావు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఆధ్వర్యంలో "మా నమ్మకం జగనన్న" సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, క్లస్టర్ ఇన్చార్జులు సాయికష్ణ రెడ్డి, సన్నీ, రాజారెడ్డి, డివిజన్ అధ్యక్షులు వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

AUCTION NOTICE
IN THE HONOURABLE COURT OF THE XVI ADDITIONAL DISTRICT JUDGE AT NANDIGAMA, KRISHNA (NTR) DISTRICT
E.P.1429/2019 IN A.A.656/2011

Between:
M/s. SHRIRAM TRANSPORT FINANCE COMPANY LIMITED . . . DHr
And:
SRINIVASA ENGINEERING CONSTRUCTIONS COMPANY, Rep by its Managing Partner Potluri Vishnu Vardhana Rao and another . . . JDr's

SALE OF IMMOVABLE PROPERTY

The General Public / Interested bidders are hereby informed that in the above E.P. the below mentioned immovable properties belonging to Judgment Debtor herein are ordered for Sale in an open court auction, the said auction is to be held on **28-04-2023** in the premises of XVI Additional District Judge at Nandigama, Krishna (NTR) District at **10:30 Am.**

SCHEDULE OF THE PROPERTY

Schedules of Immovable Property belongs to 1st JDR Mr. Potluri.VishnuVardhana Rao acquired under sale deed dated 16-12-1998 executed by Mr. Yerramreddy Venkateswara Rao under registered sale Deed No. 2314/1998 SRO kanchikacherla, Krishna District. Krishna (now NTR) District, kanchikacherla S.R.O, paritala Gram Panchyat and Village in Survey No.273/1A, an extent of Ac 0.78 cents of Dry land, being bounded by

East : Land of Mandala Nageswararao, Mutayya and others
South : Land of Namburi Venkayya
West : Land of ThotaNagalakshmi and others
North : Land of Mandala Mariyamma and others

DHR'S VALUE Rs.20,00,000/-
(BY ORDER OF THE COURT)
T.V.V.S.SARMA
ADVOCATES.
Nandigama, Krishna District

12 నుండి చంద్రబాబు పర్యటన

మొదటి పేజీ తరువాయి

పొత్తుతో బిజెపి గెలుపొందాయి. కేవలం ఐదు స్థానాలకే వైసిపి పరిమితమైంది. అయితే 2019 ఎన్నికల్లో మాత్రం సీన్ రివర్స్ అయింది. టిడిపి రెండు స్థానాలకు పరిమితం కాగా, వైసిపి 14 సీట్లను గెలుచుకుంది. దీంతో వచ్చే ఎన్నికల్లో తిరిగి పట్టు సాధించేందుకు టిడిపి సన్నాహాలు ప్రారంభించింది. దీనిలో భాగంగా ఈనెల 12 నుండి జిల్లాలో జరిపే పర్యటనలో చంద్రబాబు ఆ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేయనున్నారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
విజయవాడ బ్రాంచి ఆఫీసులు -
బోడెమ్మ హోటల్ ప్రక్కన, బి ఆర్ పి రోడ్, 1 టౌన్.
శ్రీ కృష్ణ నిలయం, విజయబ్యాంక్ పైన, గవర్నర్‌పేట.
జమ్మిచెట్టు సెంటర్, మోడరన్ అకాడమీ కాలేజి ప్రక్కన, మొఘల్‌రాజపురం.

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 24.04.2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 437.49 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT GUDIVADA
E.P. NO. 8/2023 IN O.S. NO. 113/2017

Between :
Adapa Venkata Ramana Kumar, S/o Srinivasa Rao, Hindu, aged, about 33 years, Private Employee, R/o D.No. 19/181, Munsub vari street, Bethavolu, Gudivada, Krishna District
... Petitioner / Decree Holder.
And
1) Bandreddi Venkata Rama Rao, S/o Krishna Murthy, Hindu, aged about 46 years, R/o D.No. 19-156, Munsub vari street, Bethavolu, Gudivada, Krishna District.
2) Bandreddi Subramanyeswara Rao, S/o Krishna Murthy, Hindu, aged about 51 years, Business, R/o D.No. 19-156, Munsub vari street, Bethavolu, Gudivada, Krishna District.
...Respondents/ Judgement Debtors.

పై నెంబరు Execution Petition లో Respondents/ Judgement Debtors 1, 2 లకు రూల్ 54 నోటీసుల నిమిత్తం ది. 20-4-2023 తేదీకి వాయిదా అయివున్నది. ఆక్షేపణలు వున్నయెడల అదేరోజు ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ కోర్టుకు వచ్చి ఆక్షేపణలు తెలియపరచవలెను. లేనియెడల కోర్టువారు మీకు పరోక్షంగా తీర్మానం చేయుదురు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

గుడివాడ
తేదిం04-04-2023

ఇట్లు
సిహెచ్.వెంకటరమణ,
అడ్వకేట్, గుడివాడ.
సెల్ : 9985091910

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గుడివాడ
ఓ.యస్.నెం. 210/2021

మామిళ్ళపల్లి వెంకట నారాయణరెడ్డి ...వాది
మరియు
1)వట్టిప్రోలు దేవదాన రత్నకుమార్
2) డా॥ దేవర యాదిద్య ...ప్రతివాదులు

పై ప్రతివాదులులో 1 వ ప్రతివాది అయిన వట్టిప్రోలు దేవదాన రత్నకుమార్ S/o.వెంకటరత్నం, ప్లాట్ నెం.405, సిబిఆర్ రెసిడెన్సీ, ఏలూరు రోడ్డు, Telephone Exchange ప్రక్క గుణదల విజయవాడ NTR District వారి హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.17-04-2023వ తేదిన వాయిదా వేసినారు. యిందులో 1వ ప్రతివాది స్వయంగా గాని న్యాయవాది గారి ద్వారా గాని ఉదయం 10-30ని॥లకు హాజరు కావలయునని. లేనిచో మీ పరోక్షంలో మీకు వ్యతిరేకంగా దావా విచారణ చేయబడునని తెలియపర్చుడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ప్రకటన జారీ చేయడమైనది)

ఇట్లు
దగాని సత్యనారాయణ,
న్యాయవాది,
గుడివాడ,
సెల్:9441071930

నగర పంచాయతీ కార్యాలయము, తిరువూరు

ఆర్.ఓ.సి. నెం. 169/2022/ఎ1 **తేది: 04-04-2023**

బహిరంగ వేలం నోటీసు

తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని 2023-24 సం॥నకు కూరగాయల మార్కెట్టు షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి ది.31-03-2023న సాయంత్రం 04-00 గం.లకు నగరపంచాయతీ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించగా సర్దార్ పేట బాపనయ్య కూరగాయల మార్కెట్ షాపులు వేలం నందు ఎవరూ పాల్గొనకపోవుట వలన వేలం పాటను .ది.06-04-2023, మధ్యాహ్నం 2.00 గం.లకు వాయిదా వేయటమైనది అని తెలియజేయడమైనది. మరియు ఇతర వివరములకు కార్యాలయం పనిచేయు వేళల యందు సంబంధిత గుమస్తా నుండి తగు సమాచారం తెలుసుకొనవచ్చును.

వ.నెం.	గుత్త వివరము	దాఖలు చేయవలసిన సాల్వెన్సీ	వేలము కాలంలో ముందుగా చెల్లించవలసిన ధరావత్తు రూ.	వేలం కాలములో ముందుగా ఉద్బు ఛార్జీలు నిమిత్తం చెల్లించవలెను.	గుత్తకాల పరిమిత్తి
1.	పేట బాపనయ్య కూరగాయల మార్కెట్ (ఒక్కొక్కషాపుకు)	1,00,000/-	10,000-00	1000-00	ది.01-4-2023 నుండి ది.31-3-2024 వరకు

గమనిక:- వేలంపాటలో పాల్గొనదలచినవారు ముందస్తుగా రూ.100/- స్టాంపు పేపరును సమర్పించి వేలం పాటలో పాల్గొనవలెను.

సం॥ XXXXXXX
కమీషనరు,
తిరువూరు నగరపంచాయతీ.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు
7
బుధవారం 5 ఏప్రిల్ 2023

నేడు శ్రీ అద్దంకి నాంచారమ్మ జాతర మహోత్సవం

ఆలయ ఇఒ పామర్తి సీతారామయ్య

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలోని శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లి నెల జాతర మహోత్సవం బుధవారం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. మంగళవారం స్థానిక పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ బుధవారం నాడు అమ్మవారి నెల జాతర మహెూత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు, ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో అందంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి 10 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడా కూడా యాత్రికులకు ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. స్నానాలు ఆచరించే కృష్ణా నది వద్ద పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మార్చి 6, 7 తేదీల్లో అమ్మవారి ప్రధాన జాతర మహోత్సవం వైభవంగా జరిగిందని వివరించారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు : గోవర్ధన్

ప్రజాశక్తి-అవనిగడ్డ

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని మాల మహానాడు జిల్లా కన్వీనర్ దోవా గోవర్ధన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతదేశం గర్వించేలా కృషి చేసిన మహనీయుడిని దుర్భాషలాడుతూ ఆయన విగ్రహ నిర్మాణంపై నీచమైన రాతలు రాసి కోట్లాదిమంది ప్రజల మనోభావాలను గాయపరిచిన అగ్రవర్ణ కుల దురాహంకారి గుడివాడ శివ అనే వ్యక్తిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

9న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండలంలోని అంగులూరు శ్రీ జ్ఞాన సాయి మందిరంలో ఈనెల తొమ్మిదో తేదీన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. దుగ్గిరాల చిన్నబ్బాయి శ్రీ మతమ్మ జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో ఉచిత కంట పరీక్షలు, ఉచిత ఆపరేషన్ జరుగుతాయని వివరించారు.

కంచి మృతికి కాపునాడు సంతాపం

ప్రజాశక్తి-ఉయ్యూరు

మార్కెఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావు మృతి పట్ల జిల్లా కాపునాడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. కాపునాడు జిల్లా అధ్యక్షుడు దాసుశ్రీనివాసరావు మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరువూరు పంచాయతీ సర్పంచ్‌గానూ, ఉడా చైర్మన్ గా, మార్ ఫెడ్ చైర్మన్గా బాధ్యతలు చేపట్టి పదవులకు వన్నెతెచ్చి సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగి న నాయకుడిగా పేరుగడించిన రామారావు మతి తీరనిలోటన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో రైతులు సాగునీటి సమస్య పరిష్కారానికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

ఎందరికో స్ఫూర్తి చింతపల్లి లక్ష్మారాయుడు

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-గన్నవరం

పేద ప్రజల శ్రేయస్సు కోసం అనునిత్యం తపిస్తూ ఎర్రజెండా చేతబూని, ఎందరికో స్ఫూర్తినిచ్చిన గొప్ప నాయకుడు చింతపల్లి లక్ష్మా రాయుడు అని బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, సిపిఐ నాయకులు కొండా వీరాస్వామి అన్నారు. మంగళవారం బుద్ధవరం గ్రామంలో స్థూపం వద్ద చింతపల్లి లక్ష్మారాయుడు మూడో వర్ధంతి కార్యక్రమం వామపక్షాల ఆధ్వర్యంలో జరిగింది. బాలమ్మ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఆంధ్రా ప్రాంతంలో నేలకొరిగిన తొలి అమర వీరుడు అని గుర్తుచేశారు. తన సోదరుడు చింతపల్లి పాపారావు స్ఫూర్తితో లక్ష్మారాయుడు విద్యార్థి దశలోనే ఎర్ర జెండా చేత బూనారన్నారు. పేదలు, రైతులు, కార్మికుల పక్షాన జరిగిన పోరాటాల్లో పెద్దఎత్తున పాల్గొన్నారని గుర్తుచేశారు. సిపిఐ నాయకులు వీరాస్వామి మాట్లాడుతూ ధనిక రైతు కుటుంబంలో పుట్టినా అనునిత్యం పేదల పక్షాన నిలిచారన్నారు. పాలేర్లు, రైతులు, కౌలుదారుల సమస్యల పరిష్కారానికి సాగే ఉద్యమాల్లో ముందు భాగాన నిలిచారన్నారు. బుద్ధవరం మాజీ సర్పంచ్ గండికోట దశరథ రామయ్య మాట్లాడుతూ పేదల సాగు భూములు, ఇళ్ల స్థలాల సమస్యలు, విమానాశ్రయ విస్తరణ బాధితుల తరుపున నిలిచి పోరాడారన్నారు. గన్నవరం ప్రాంతంలోని బుద్ధవరం గ్రామ పంచాయతీలో అత్యధిక మంది పేదలకు ఇళ్ల స్థలాలు సాధించటంలో ఆయన పాత్ర కీలకమన్నారు. గ్రామాల్లో అందరినీ కూడగట్టి, ఐక్యంగా నిలబెట్టి, నిధులు రాబట్టి గ్రామాభివృద్ధికి పాటు పడ్డారన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బడుగు మరియదాసు, నక్క రామారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి : కైలే

ప్రజాశక్తి - మొవ్వ

వేసవి కాలం ప్రారంభంలోనే పెరుగుతున్న ఎండలు, తీవ్రతరమవుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని అధికారులు గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ అధికారులను కోరారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మొవ్వ మండలంలోని నిడుమోలు శివారు గ్రామాలైన మల్లేశ్వరం, వీరాయిలంకలలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని గురించి వెల్లడించారు. ఈ సందర్భంగా నవరత్నాలకు సంబంధించిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల పేద ప్రజానీకానికి అందజేస్తున్న పలు పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, వైస్ ఎంపీపీ డొక్కు వెంకటేశ్వరరావు, సర్పంచి కొమరగిరి అంజలి, ఎంపీడీవో జి సుధా ప్రవీణ్, తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎం ఎన్. ఎస్ మూర్తి, వీఆర్వో ఎం నవీన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, మండల, గ్రామస్థాయి అధికార పార్టీ నాయకులు, కూచిపూడి ఎస్సై డి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమం పట్టని ప్రభుత్వం : వర్ల

ప్రజాశక్తి పెదపారుపూడి

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం దళితుల సంక్షేమానికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వటం లేదని టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల కుమార్‌రాజా విమర్శించారు. భారతదేశ మాజీ ఉప ప్రధానమంత్రి కీర్తిశేషులు డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని రూపొందింని కరపత్రాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారారు. బుధవారంనాడు పెదపారుపూడి మండలంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించేందుకు ఉదయం 9 గంటలకు యలమర్రు సెంటర్లో ప్రారంభిస్తున్నామని టిడిపి మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గన్నవరం

ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చిన్న అవుటుపల్లి సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. గన్నవరం మండలం చిన్న అవుటపల్లిలోని డాక్టర్ సిద్ధార్థ వైద్య కళాశాల వారిచే ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును గోపవరపుగూడెం గ్రామపంచాయతీలో ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిఎం నాయుడు హెచ్వోడి, గ్రామ సీనియర్ నాయకులు గొట్టిముక్కల దుర్గాప్రసాద్ ఈవో శ్రీను గణేష్ పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు

కంకిపాడు మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో మండల కార్యాలయాలకి వచ్చే ప్రజలు దాహం తీర్చుకునే నిమిత్తం తహశీల్దార్ తోట వెంకట సతీష్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో 4వ సారి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తహశీల్దార్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అందరికీ మజ్జిగ పంపిణీ చేశారు.

మజ్జిగను పంపిణీచేస్తునన తహశీల్దార్ తోట వెంకట సతీష్

ప్రథమ చికిత్స శిక్షణ కరదీపిక పుస్తకావిష్కరణ

మచిలీపట్నం అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సిఎస్) కృష్ణాజిల్లా శాఖ రూపొందించిన ప్రథమ చికిత్స శిక్షణ కరదీపికను జిల్లా కలెక్టర్, ఐఆర్ సిఎస్ అధ్యక్షులు పి.రంజిత్ బాషా మంగళవారం తన ఛాంబర్లో ఆవిష్కరించారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీలో కొత్తగా ప్యాట్రన్ మెంబర్లుగా సభ్యత్వం తీసుకున్న కొండపల్లి రాంబాలాజీ, జె.రామ్ నితీష్, ఏలూరి ఫిలిప్ లను కలెక్టర్ అభినందించి మెంబర్ షిప్ ఐడి కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఐఆర్ సిఎస్ చైర్మన్ తోట ఎస్.ఎస్ బాలాజీ మాట్లాడుతూ మొదటి సహాయంగా ఆరోగ్య ఇబ్బంది కలిగినపుడు, ప్రమాదం సంభవించినప్పుడు తాత్కాలికంగా సహాయమే ప్రథమ చికత్స అన్నారు. వైద్య సహాయం లభించే వరకు సేద తీర్చుటమే ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రథమ చికిత్సకునికి ఉండాల్సిన లక్షణాలు, పాటించాల్సిన సూత్రాలు, ప్రథమ చికిత్స ఆశయాలు, సహాయపు సూత్రాలు ఈ పుస్తకంలో పొందు పర్చామన్నారు. రెడ్ క్రాస్ అందించే ప్రథమ చికిత్స శిక్షణలో భాగంగా గాయపడిన వారి సహాయార్థం స్త్రీ, పురుషులకు శిక్షణ, విద్యార్థులకు ప్రథమ చికిత్స గురించి భోధన, చికిత్సకు ఉపకరించే సామాగ్రిని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ శంకర్ నాథ్ భవిరి, ట్రెజరర్ కొండపల్లి రాంబాలాజీ, రాష్ట్ర ఎంసి సభ్యులు కొత్తగుండు రమేష్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

ఉద్యోగులు, అధికారుల సహకారంతోనే జిల్లా అభివృద్ధి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఉద్యోగులు, అధికారుల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువ చేయగలుగుతున్నామని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. జిల్లా కలెక్టర్‌గా పదవీ భాధ్యతలు చేపట్టి ప్రధమ సంవత్సరం పూర్తి చేసుకున్న జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావును ఏపిఎన్‌జివో అసోసియేషన్ ఎన్‌టిఆర్ జిల్లా మరియు విజయవాడ నగరశాఖ కార్యవర్గ సభ్యులు కలిసి మంగళవారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ను అభివృద్ధి పదంలో అగ్రగామిక నిలపడంలో ఉద్యోగుల సహకారం ఎంతో కీలమైనదన్నారు. జిల్లా యంత్రాంగం ఉద్యోగులకు అప్పగించిన లక్ష్యాలను సాధించడంలో మరింత కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువ చేయడంలో ఉద్యోగులు సహకారం ఎంతో అవసరమన్నారు. పారదర్శకమైన సేవలను అందించి జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పదంలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. ఏపిఎన్‌జివో జిల్లా అధ్యక్షులు ఏ విద్యాసాగర్ మాట్లాడుతూ జిల్లాల పునవ్యస్తీకరణ అనంతరం ఏర్పడిన నూతన జిల్లాకు కలెక్టర్‌గా పదవీ భాధ్యలు చేపట్టి ప్రజా రంజక పాలన అందించడంలో వినూత్నశైలిని అవలంభిస్తూ రాష్ట్రంలోనే

ఎన్‌టిఆర్ జిల్లాను మార్గదర్శకంగా నిలపడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్‌గా సామాన్య ప్రజల సమస్యలను ఓర్పుగా విని, స్వయంగా పరిష్కార మార్గాన్ని కనుగొన్ని కింది స్థాయి అధికారులకు సూచించి పరిష్కరిస్తున్న తీరు ఆయా వర్గాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్న ఉద్యోగులను వెన్ను తట్టి ప్రోత్సహించడం ఉద్యోగులు మరింత ఉత్సహంగా పనిచేయుటకు దోహదపడుతుందన్నారు. ప్రజలకు సేవలందించడంలో జిల్లాకు చెందిన ఉద్యోగులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. దైనందిక విధులతో పాటు జిల్లా యంత్రాంగం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిద్దంగా ఉంటారన్నారు. జిల్లా కలెక్టర్‌కి అభినందనలు తెలిపిన వారిలో ఏపిఎన్‌జివో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యండి ఇక్బాల్, కారవర్గ సభ్యులు బి. సతీష్ కుమార్, యం రాజుబాబు, డి. విశ్వనాథ్, సిహెచ్ మధుసుదన్‌రావు, నాగేంద్రరావు, బివి రమణ, నగర కార్యవర్గ సభ్యులు కె. శివలీల, సిహెచ్. శ్రీరామ్, కె. సంపత్‌కుమార్, నజీర్‌ఉద్దీన్, వి.వి.ప్రసాద్, కాశీమ్, గణేష్, వరప్రసాద్, కె. శివశంకర్ ఉన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

కార్పొరేటర్ సత్యబాబు పర్యటన

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు ప్రాంతంలో ప్రజా సమస్యల తెలుసుకునేందుకు కార్పొరేటర్ బోయి సత్యబాబు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రిటైనింగ్ వాల్, డ్రైనేజీ సమస్యలను స్థానిక ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ చాలాకాలంగా కూలిపోయిన రిటైనింగ్‌వాల్స్ నిర్మాణాలు నిలిచిపోయాయాని, వాటిని నగరపాలక సంస్థ అధికారులు వెంటనే నిర్మించాలని కోరారు. స్థానిక సమస్యలను అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయడం జరిగిందని, సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కషి చేస్తానని ప్రజలకు తెలియపరిచారు. ఈ పర్యటనలో డివిజన్ సిపిఎం నాయకులు పి. రాజు, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో సాదారణ కౌన్సిల్ సమావేశం చైర్మన్ మండల వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. 23 అంశాలను చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో టిడిపి కౌన్సిలర్ కొంగర శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టణంలో గత రెండు నెలల నుంచి మంచినీటి కొరత ఉందని సమస్యను పరిష్కరించడంలో అధికారపక్షం, అధికారులు విఫలమయ్యారని తెలిపారు. గత నాలుగు సంవత్సరాల క్రితం శాంక్షన్ అయిన ప్రాజెక్ట్ ని ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. పట్టణంలో ప్రజల సమస్యలను సమస్యలను పరిష్కరించాలని శ్రీకాంత్ తెలిపారు. కమిషనర్ డాక్టర్ జయరాం మాట్లాడుతూ మంచినీరు అవసరమైన ట్యాంకర్లను నిత్యం పంపిస్తున్నామని, సమస్య పరిష్కారం కోసం కషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ కోఆప్షన్ సభ్యులు, పురపాలక సంఘం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలో పాత బైపాస్ గ్యాస్ కంపెనీ రోడ్డు నందు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా మంగళవారం మెగా మెడికల్ హెల్త్ క్యాంపు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణ తెదేపా కౌన్సిలర్లు, తెదేపా నేతలు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కేశినేని శివనాద్ తో కలిసి మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా నందిగామలో మెగా ఉచిత హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేశాం అన్నారు. కేశినేని ఫౌండేషన్ ద్వారా ఈ విధంగా పేద ప్రజలకు సహాయం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

జైన్ మహావీర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: భగవాన్ మహావీర్ చూపిన అహింస బాటలోనే జైనులంతా పయనించడమే కాక సమాజాన్ని కూడా ఆ దిశగా చైతన్య పరుస్తున్నామని జైన్ సమాజ్ ఆర్గనైజేషన్ విజయవాడ శాఖ ప్రతినిధులు స్పష్టం చేశారు. జైనమతం 24వ తీర్థంకరుడైన మహావీరుని జన్మదిన వేడుకలు విజయవాడలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బందావన్ కాలనీలోని ఎ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ వేడుకలను జైన ప్రముఖులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మహాసశతావధాని అభినందన చంద్ర సాగర్ మహారాజ్ వద్ద శిక్షణ పొందిన కవల బాలమునులు నమి చంద్రసాగర్, నెమి చంద్రసాగర్ సంయుక్తంగా శతావదాన ప్రక్రియను నిర్వహించారు. దాదాపు రెండు గంటల పైగా సాగిన ఈ అవధాన ప్రక్రియ బాల సన్యాసుల ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. హిందీ, ఇంగ్లీష్, గుజరాతి, భాషలలో పశ్చకులు అడిగిన ప్రశ్నలకు బోధకులు సునాయాసంగా సమాధానాలు ఇస్తూ సబికులను ఆశ్చర్యానికి గురి చేశారు. ఈ సందర్భంగా విజయవాడ జైన్ సమాజ్ ప్రతినిధులు ప్రవీణ్ జైన్, సంజయ్ కుమార్ మెహతా జైన్, నరేంద్ర సోలంకి, దినేష్ జైన్, మహేందర్ జైన్ మనోజ్ కొఠారి పభతులు మాట్లాడుతూ మహావీరుడు బోధించిన బ్రతుకు బ్రతికించు అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని తమ జైన సమాజం పని చేస్తోందన్నారు. సృష్టిలో నివసించే ఏ జీవికి కూడా హింసించకుండా హాని తలపెట్టకుండా జీవించాలని, ఆ దిశగా సమాజాన్ని చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు.

16న కృష్ణాజిల్లా రచయితల సంఘం పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన సాహితీమూర్తులకు ఈనెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు నగరంలోని హోటల్ ఐలాపురం కాన్ఫరెన్స్ హాలులో పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు కష్ణాజిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, జి.వి.పూర్ణచంద్ తెలిపారు. 2022వ సంవత్సరానికిగాను శ్రీ మండలి వెంకట కష్ణారావు సాహితీ పురస్కారాన్ని బెంగళూరు మనసు ఫౌండేషన్‌కు చెందిన మన్నం రాయుడుకు, శ్రీ ఆలూరి బైరాగి సాహితీ పురస్కారాన్ని డాక్టర్ వెన్నా వల్లభరావుకు, శ్రీ గుత్తికొండ సుబ్బారావు సాహితీ సేవా పురస్కారాన్ని రాష్టేతర తెలుగు సమాఖ్యకు, శ్రీముక్కామల నాగభూషణం పాత్రికేయ ప్రతిభా పురస్కారాన్ని జి. రాజశుకకు, శ్రీపోలవరపు కోటేశ్వర రావు కథా పురస్కారాన్ని డాక్టర్ కొచ్చర్లకోట వెంకట సుబ్బారావుకు, శ్రీపోలవరపు కోటేశ్వరరావు బాలసాహిత్య పురస్కారాన్ని ముంజులూరి కష్ణకుమారికి, శ్రీ వేములపల్లి కేశవరావు, శ్రీమతి విశాల గార్ల అనువాద ప్రతిభాపురస్కారాన్ని ముకుంద రామారావుకు ప్రదానం చేస్తామని తెలిపారు. పురస్కార గ్రహీతలకు రూ.10 వేలనగదుతోపాటు సత్కారం, సైటేషన్ బహూకరణ ఉంటుందని తెలిపారు.

యేదుపాటి రామయ్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: కేశినేని భవన్‌లో మాజీ కార్పొరేటర్, ఎన్టీఆర్ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ యేదుపాటి రామయ్య జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ టిడిపి నాయకులు గన్నే వెంకట ప్రసాద్ (అన్నా), టీడీపీ అధికార ప్రతినిధి లింగమనేని శివరామ ప్రసాద్, నియోజకవర్గ నాయకులు ఎంఎస్ బేగ్, ఎన్టీఆర్ జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి సారేపల్లి రాధాకష్ణ పాల్గొని కేక్ కట్ చేసి రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు విశ్వం డానియల్, పశ్చిమ నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలు సుకాసి సరిత, మాధవ, అద్దేపల్లి శివ, శివశర్మ, గంగాధర్ రెడ్డి, బోగవల్లి నాగబాబు, దూది బ్రహ్మయ్య యాదవ్, బబ్బురి శ్రీనివాస్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

భారత్ పే గ్రూప్ భాగస్వామ్యం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఫిన్‌టెక్ పరిశ్రమలో భారత్ పే గ్రూప్ ఉమెన్ ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ ఫ్లాట్‌ఫామ్‌తో భాగస్వామ్యం చేసుకున్నట్లు సంస్థ ప్రతినిధి కె.రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా మహిళా వ్యాపారవేత్తలు, స్వీయ సమృద్ధి సాధించేందుకు, వ్యాపారాభివృద్ధికి తోడ్పడనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా పారిశ్రామిక వేత్తలను ఒకచోటకు చేర్చి వారికి అవసరమైన పరిజ్ఞానంతో పాటు వ్యాపార లక్ష్యాలను చేరుకోవడానికి అవసరమైన పరిజ్ఞానం అందించనున్నట్లు తెలియచేశారు. భారత్ పే సంస్థ కార్పొరేట్ సామాజిక బాద్యత కార్యక్రమం కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైసిపితోనే మహిళా సంక్షేమం : వెలంపల్లి

ప్రజాశక్తి-వన్‌టౌన్: మహిళా సంక్షేమం సీఎం జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. మంగళవారం 34వ డివిజన్ కేదారేశ్వరపేట విఎంసి కళ్యాణ మండపంలో 34, 35, 56 డివిజన్ల లోని స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. 352 స్వయం సహాయక సంఘాల్లోని 3,520 మందికి రూ.2,37,65,172ల విలువైన చెక్కును అందచేశారు. అఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బండి పుణ్యశీల, బాలసాని మణేమ్మ, యలకల చలపతిరావు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-వన్‌టౌన్: వేసవిని దష్టిలో పెట్టుకొని 45, 46 డివిజన్లలో అవసరమైన రెండు చోట్ల చలివేంద్రాలను ప్రారంభించడం అభినందనీయమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైసిపి నాయకులు ట్రాక్టర్ రాము ఆధ్వర్యంలో మంగళవారం రెండు చోట్ల ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రములను వెలంపల్లి ప్రారంభించారు. చలివేంద్రం ప్రారంభం సందర్భంగా మజ్జిగను ప్రజలకు వెలంపల్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైసిపి నాయకులు వెన్నం రజినీకుమార్, గంగవరపు మురళీమోహనరావు, మాగం ఆత్మారామ్, బైపినేని కోటేశ్వరరావు, దేవర సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.